# పల్లెగూడెం కాడ

రోజుటాలె సీతాయ్, ఎంకాయ్ పుల్లలేరుకోను, సేలన్నీ దాటా, దిబ్బలంటా ఎక్కుతా, కుంటలంటా దిగుతా, ఆడ్తా, పదాలు పాడ్తా, గొడ్డమంద కెనకమాలె కిట్టకాలవకట్టకు సేరుకుండారు.

"యీయాల అచ్చరగాయ లాడదద్దంటే, సీతాయ్? బాగుంతదే?"

"ఆడ్డాం గానీ...ఎంకాయ్, నూతో ఓరాస్సెం సెప్పాలే?"

"ఏందే బుల్లే, సెప్పే, సెప్పే!"

"ఏందోనే...మరే..."

"ఓసెమ్మ పానీలేయే, నీకే మా వుందిలే పాయే..."

"గబ్బు లేపవు గందా?"

"లేపనన్నాగా, సెప్పే?"

"...నా పెల్లంటే."

"పెల్లీ –"

"ఆఁ, పెల్లంటే!"

"అమ్మో, ఎట్టా!"

"ఎట్టాగేందే!"

"ఎట్టాగేందీ? నూ పెల్లవుతావనుకో! నీ మొగుడోడు నిన్నేడకన్నా లేపేసుకుపోతాడే!"

"ఆఁ!"

"ఆఁ, ఎట్టా! నన్ను కూడా తీసుకుపోయే?"

"ఊఁ మా అయ్యె తిట్టడూ?"

"ఎందుకు తిడ్తాడమ్మా?"

"................."

"సీతాయ్, సీతాయ్?"

"నీకు మతుకు పెళ్ళి కాదంటే?"

"ఏందీ...?"

"ఏం నంగనాసివే?"

"నే పెల్లాణ్ణుగా, నీకు మల్లెనుకుండావా?"

"మీ అయ్య సావ దన్నడూ?"

"మా అయ్య మంచోడుగా, మీ అయ్యకుమల్లే..."

"ఆఁ ముద్దెత్తుకుంతాడు...మరి పెల్లాడ కేం సేత్తావే?"

"ఏం సేత్తే నీకేం? యిట్టనే వుంతా, అసలు పెల్లెందుకమ్మా? నీకేం పెల్లాడ్తావ్ ఏమన్నా సేత్తావ్, ఆడు కాత్తా లేపేసుకపోతే-"

"అసలయిందంటా? అయ్యా అవ్వా మదనపడ్తంటే, ఎనకమాలుండి యిన్నానే!"

"ఏందీ? ఎట్టెట్టా!"

"పెల్లి సేత్తె బాగుంతదనీ ఎటకారం సేత్తంది ముసల్ది..."

"పానం తీశావుగందే. మరుసనాడే అవుద్దన్నట్టు అదలగొట్టి సంపావూ?"

"నాకు మతుకు తెలుసెట్టా-"

"సాల్లే పెల్లి కూతరా, యీపాలికి, నీమీన గొడ్దెక్కిచ్చేసేదాన్నే యీయాల కల్లా! యిం కీత యీదేయాలా, పుల్లలేరేయాలా, బుల్లివి గంద, సాల్లే సప్పున్రా".

ఆటలే ఆడారా, సిన్ని సిరతలూ పాటలే పాడారా సోద్దెమంటానూ, యీతలే యీదారా యింత యింతగనూ, నాత్తెమంటా ఆడారా సిలిపి పిల్లోడా అంట!

సప్పుసప్పున పుల్లాగిల్లా కట్టేసుక, సిన్ని పైటలెగరాడ్తా సిందులేత్తా, గొడ్దెనకమాలె ఆడ్తా, పదాలు పాడ్తా, సందకాడయ్యే తలికి ఎప్పుటాలె ఒయ్యారమంటా పల్లిగూడెం సేరేసుకుండారు ఎంకాయ్, సీతాయ్...

"...అవ్వోయ్, అయ్యొచ్చాడంతే."

"యాడికెల్లా దేందో, యీయాల్దాకా యీడే కూకుండాడు."

పుల్లా పుడకా పొయికాడ సక్కంగ కువ్వేసి, జుత్తు యిదలేసుకా, గాబుకాడ కుండలోని నీల్లతో ఒల్లంతా ఆడీడ సక్కగా కడిగేసుకా-

"అవ్వా, యియ్యాల బూలో కేందే?"

కూతురు లచ్చి పోయాక, తన కింకోరూ లేకపోటాన, సీతాయిని గారాబాన

పెంచింది అది. పిడకా బొడకా అమ్మి, సీతాయి పెల్లిగ్గాను కాత్తో కూత్తో యెనకేసింది. ఈరాయికి మటుకూ అత్తంటే మా అబిమానం. పెద్దముండ యింత బూవొండి పెడ్తా యిల్లు కనిపెట్టుకుంటది, తను సాటుసాట్న ఏం సేసుకున్నా, కూతురంటే పానాన, ఆసాముల పన్లకుపోతా, నాలుగు డబ్బులు తెత్తా, అందరాలె కూడా పోయేవోడు యీరాయీ.

తనకేయాల ఏమొచ్చిపడుద్దో, సీతాయి పెల్లిసూసి సత్తానంటా మొండికెత్తి కూకుంది ముసల్ది. పదమూడేల్ల సీతాయికి పెల్లేందందామా, పానీ, యిది మంచి, యిదిసెబ్ర, అని సెబదామా, ఆకూత్తే వోడిపాలన్నా పడుద్దేమో? చరేనంటా, మంచి పిల్లకాయ దొరుకుతాడేమోనని, సూత్తుండాడు...

"కుండలో నీలుపోయే తల్లా, సీకటయి పోతల్లా?"

"ఏందమ్మా పద్దాక తిప్పి సంపుతారూ, బూలోకి ఏందమ్మా, అంటే–"

"తెలగడ్డలేసి రొయ్‌పప్పు...అయ్యొ సంబరమా! మొదలు నీలు తేవంటే?"

"ఊఁ" అని మూతి తిప్పుతా గబగబ కుండ సంక నేసుక లగెత్తింది సీతాయ్... "కుంట కాడికి నీలకొత్తావంతే ఎంకాయ్"

"వత్తున్నా వుండేయ్..."

"యీయాల సందమామ ఎంత బాగుండాడే..."

"సలసల్లగా రారా సక్కనయ్యా" (సీతాయ్ పాడుద్ది) "సందమామా. సందమామా నూ, దామంటె వత్తావ సందమామా?"

(ఎంకాయ్ అందుకుంటది) "ఆటలంట ఆడుకుంతె సూత్తానె నవ్వుతానే"

"సందమామా, సందమామా నూ అల్లిబిల్లి ఆడ్దాం వత్తావ సందమామా?"

"రామంటె ఈలవుద్దా, సెట్టుకింద ముసలవ్వ కొట్టుద్దీ, తిట్టుద్దీ"

సీతాయ్ పాట "సందమామా, సందమామా నూ రాకుంటె ఎన్న ముద్ద పెట్టనోరి సందమామా?"

"ఎన్నముద్ద తినే యేల నీతోటె కూకుంటా, నీకాడ బూ తింటా"

"సందమామా, సందమామా నూ పద్దాకుంటె సాలు సందమామా"

"బద్రమమ్మ కాల్ జారుద్దీ! కుంటకీయాలే నీలుబెట్టారూ"

"నాటొచ్చాక మావ్వ నన్ను నాటుకు తీసి కెల్తాందిగా"

"అబ్బా నేమతుకు రానెట్టా మా అయ్ నడిగీ?"

"నూ రాందీ, పోను మనసు పోద్దంటే?"

"బలే కుశాలగుంటదే, ఏం? ఆల్లందర్నీ ఎనకమాలపెత్తి ఆవజాన సేనంతా నాటెయ్యం? హుఁ హుఁ."

"ఆ లెక్క లేకుండా, ఆ మాత్తరం సేయ్ లేంగా?"

"సీతాయ్, సీతాయ్ ఇయాల మనిద్దరం ఓకాడ బూతిందామె"

"ఓకాడే పండేసుకునీ, ఎన్నెట్టో కతలు సెప్పుకుందాంగా!"

* * *

"తెల్లగా తెల్లారిపోంది, ఇదేందమ్మా యింకా లెగవరూ! చీతాయ్ ఎంకాయ్ లెగవండి లెగవండి, ఇదేందమ్మా! రేత్తిరంతా సంపుకుతిన్నారూ? లెగే చీతాయ్! శాకిరీ సేసుకోక్కర్లా?..."

"ఏందమ్మా... కూసేపుండు..."

"ఓసి నీ యిల్లు నేలగట్టా, అయ్యారి కెల్లాళ్ళే!"

"ఆ... అయ్య రేత్తిరే యాలకూ రాలేదు గదమ్మా!"

"సెబతా, లే, పనంతా ఆవజానుందీ!"

"ఎంకాయ్, ఎంకా... లేశావంతే! ఈయాల దబ్దబున పంచేసుక, సల్దిబూ తిని పుల్లేరుకోను కిట్టకాలవకు పోవొద్దూ?"

"రేత్తిరి సెద్ద-బాగుందే... పోతున్నా వుండే... కేకేత్తావుగా..."

"అయ్యేడికల్లాడమ్మా, కొత్తపయిటా కొత్త రెయికా తెత్తానీ?"

"నిసిరేత్తిరనంగా వొచ్చే, పెదపాలెంకాడ ఓ పిల్లోడున్నాడు, సూసొత్తాని, పెందరకాడే లెగిసిపోయే"-

"పాపం తెత్తాని ఆసె పెత్తీ?..."

"తేడంటే, పెల్లంటూ తేల్నీ! మురుగులూ, దుద్దులూ, కడాలూ, ఇయన్నీ సేయించనూ?"

"నా కొద్దు పో. అసల్నే పెల్లాణ్ణూ!"

"మా సిట్టమ్మే, యేం పోకడ పోతాయే, పెల్లయిన మరసనాడు మమ్మల్నసలు సూత్తా!"

"ఊఁ... మరి ఎంకాయ్ నాతో కూడా రావద్దమ్మా?"

"ఛీ! తప్పు కాదంటే, అదిమటుకు కూకుంతదెత్తా! వాల్లయ్య దానికి మటుకు

పెల్లి సేయ్‌దూ? మాసక్కా సాగుద్ది పెల్లంతూ కావాల గాని... సాల్లే వగలు, సల్ది బూ తిందువురా."

"ఊc..."

"కొక్కిరిద్దువులే. మొగుడయ్యొత్తే..."

* * *

"ఎంకాయ్, నే పోతుండా?..."

"ఒచ్చొచ్చె!..."

"సూశామ్మా, గొడ్లపిల్లోళ్ళు పోతుండా రప్పుడే!"

"పానీలే ఎనకమాలె పదాలు పాడుకుంటా పోదాం."

పాట సీతాయ్ "సిత్రమంటావు సెలరేగి సిందేసె సిన్ని కిష్టుడూ"

పాట ఎంకాయ్ "ఓయమ్మ యశోదమ్మ యినవమ్మ యింతింతలూ"

పాట సీతాయ్ "ఎన్న ముద్దాలన్ని యిరివిగా తింటుంటె, సెప్పవత్తా వుంటె సెంప పగలా గొట్టి సక్క బోయేనూ."

"ఇంతింత లేంది యిను యశోదమ్మ సెంప పగలాగొట్టె సిలిపి కిష్టుడూ!"

"పాలకంటా బోయి కోడ లొత్తావుంటె సెయి బట్టుక సరసమాడేనూ!"

"ఇనవమ్మ యశోదమ్మ ఎట్టా బతికేటట్టు సొరవసేసుక సంపుతావుంటే!"

"ఎకిలి పనులాంట సెయిబట్టుకోబోతే పేడముద్దా తీసుక సిందకొట్టాడమ్మ"

"ఇనవమ్మ యినవమ్మ యశోదమ్మ సంపుతాడంట సెప్పకుండేదెట్ట?"

"దొద్దొద్దొద్దొ-గట్టుక సేరాం!..."

"ఓలెమ్మ ఏం లగెత్తుందే, కాలవా."

"ఈతలేద్దాం?"

"బొమ్మరిల్లు కట్టద్దూ?"

"చెల్!"...

"నూ పెల్లి కూతురువంట! నే పెల్లికొడుకునంట! ఇల్లు కడదామంట!"

"మరే...నే పెల్లాడబోతున్నాగా! మా అయ్య... ఎల్లాడుగా?"

"పానీలేయే, నాసంగతోరిక్కావాలా?..."

"హి హి హి! ఒకమ్మాయి అలిగింది, పానీలేమ్మా, తమాసె కంటేనూ? వొప్పుడూ మనిద్దరం ఒకటిగా."

"సత్తెప్పెమానం సెయ్?"

"పెమానం!"

"మా సీతాయ్!"

"తానాలాడదాం?"

"ఓ-కెరటా ల్లెగుత్తున్నయ్యే, ఒడ్డుకాణ్ణే వుందాం"

"ఎవరు లేర్లే...దిగు దిగు..."

"వూయ్-వూయ్-వూ-"

"ఓ ఓ ఓ..."

"అబ్బ తోసుద్దేం?"

"ఎఱ్ఱగున్నై కొత్తనీలు...తవ్ తవ్-"

"కెరటా ల్లెగుత్తున్నయ్యే..."

"అమ్మో పామే! పామే! నాయనో -ఆడే, ఆడే, యీడే-"

"యాడే - అయ్యో - ఓమ్మో - సీతాయ్, సీతా - యాడికే - లోపలికి పోతుండావ్!-"

"ఎంకాయ్-పోతుండా-"

"ఒత్తుండా-సీతాయ్-వుండే-"

* * *

కెరటాలెగిరెగిరి పడ్డయ్! తోసేసుకుపోనై బొమ్మరిల్లుతో కూడా.

"కాలవగట్టేందో కరిగిపోతేను, గొడ్డకా డోరంత గొల్లుమన్నారు - గూడెమంతా కూడ గబ్బుమన్నాది-"